క్లుప్తంగా

ఉపవాస దీక్షలో ఏడేళ్ల చిన్నారి



సంతోష్‌నగర్: పవిత్ర రంజాన్ మాసంలో పెద్దలతో పాటు చిన్నారులు సైతం రంజాన్ ఉపవాస దీక్షలను పాటిస్తూ తమ భక్తిని చాటుతున్నారు. పాతబస్తీకి చెందిన మహ్మద్ రఫిక్ కూతురు ఆనం ముష్కురా (7) రంజాన్ ఉపవాస చేస్తుండడంతో అందరి ప్రశంసలు పొందుతుంది. ఆనం ముష్కురా తల్లిదండ్రులతో పాటు మూడేళ్లుగా ఉపవాస దీక్షలను కొనసాగిస్తుంది. ఇది అల్లాహ్ దయా, తౌఫిక్ ఫలితమని తల్లిదండ్రులు చెబుతున్నారు. అల్లాహ్‌కు ఆమెకు మరింత ఉపవాసం ఉండే శక్తిని ప్రసాదించాలని వేడుకుంటున్నారు.

నేడు మక్కా మసీదులో యౌముల్ ఖురాన్ సభ

శాలిబండ: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మక్కా మసీదులో మూడో శుక్రవారం ఎంబీటీ ఆధ్వర్యంలో జల్సా–ఇ–యౌముల్ ఖురాన్ సభను నిర్వహించనున్నట్లు మక్కా మసీదు నిర్వాహకులు తెలిపారు. రంజాన్ మాసం సందర్భంగా ఐదు శుక్రవారాల పాటు యౌముల్ ఖురాన్ సభ కొనసాగుతుందన్నారు. మూడో శుక్రవారం సందర్భంగా మజ్లిస్ బచావ్ తెహ్రీక్ (ఎంబీటీ) ఆధ్వర్యంలో ఉంటుందన్నారు. నాలుగో, ఐదో శుక్రవారాలు 14, 21వ తేదీల్లో మజ్లిస్ పార్టీ (ఎంఐఎం) ఆధ్వర్యంలో యౌముల్ ఖురాన్ సభ ఉంటుందన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రులు



అజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న మజహర్ ఉల్లా తదితరులు

గోల్కొండ: ప్రభుత్వ ఆస్పత్రులు నేడు కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా వైద్య సేవలు అందిస్తున్నాయని తెలంగాణ రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ అన్నారు. కమిషనర్‌గా సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా గోల్కొండ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజహర్ ఉల్లా గురువారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. అన్ని రకాల రోగ నిర్ధారణ పరీక్షలు ప్రభుత్వ ఆస్పత్రుల్లోకి అందుబాటులోకి వచ్చాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ ఖాజా మహ్మద్ రవూఫ్ ఉద్దీన్ కూడా ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

గోల్కొండ: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిదని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన టోలిచౌకిలోని ఆయన కార్యాలయంలో పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన వారు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సరైన విధానంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అంతేకాకుండా నేరుగా అధికారులను కానీ, తనను కానీ కలిసి పథకం గురించి వివరాలు అడిగి తెలుసుకోవాలన్నారు.

ఇఫ్తార్ విందు



గోల్కొండ: ఖాతాదారులకు అత్యుత్తమ సేవలు అందించడంతో పాటు యువ వ్యాపారులకు, మహిళలకు రుణాలు అందించడమే తమ లక్ష్యమని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీజీఎం సురేష్ చంద్రతేరి అన్నారు. గురువారం టోలిచౌకి రాహుల్ కాలనీలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన ఇఫ్తార్ విందులో పాల్గొన్న వారందరికీ రంజాన్ నెల శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోఠి రీజియనల్ హెడ్ ప్రమోద్ కుమార్‌రెడ్డి, సైఫాబాద్ రీజన్ హెడ్ శ్రీధర్, పంజగుట్ట రీజన్ హెడ్ దండేశ్వర రావు, ఇన్‌కమింగ్ ఆర్‌హెచ్ కల్యాణ్ వర్మ, కోఠి రీజన్ ఆఫీస్ చీఫ్ మేనేజర్ వీఎస్ఆర్ మూర్తి తదితరులున్నారు.

ప్రజాసేవ ఉన్నతమైనది

మణికొండ: ప్రజలకు ఉపయోగపడే పనులు చేయటం ఎంతో ఉన్నత మైందని, అలాంటి కార్యక్రమాలను చేపట్టేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాల్సిన అవసరం ఎంతో ఉందని మణికొండ మున్సిపల్ చైర్మెన్ కె.నరేందర్‌ముదిరాజ్ అన్నారు. గురువారం మణికొండ మర్రిచెట్టు సర్కిల్‌లో లక్ష ఫుడ్‌వేస్ వారు ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో మంచినీటిని అందించి బాటసారుల దాహార్తిని తీర్చటమే ఎంతో పుణ్యకార్యం కాగా అలాంటిది మజ్జిగను ప్రతి రోజు అందించటం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష ఫుడ్ వేస్ ఎండీ చలమారెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర

హనుమాన్ జయంతి సందర్భంగా పలుచోట్ల పూజలు.. బైక్ ర్యాలీలు

- 10 వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు
- జోరు వానలో కొనసాగిన యాత్ర
- కోఠి ఆంధ్రాబ్యాంక్ చౌరస్తాలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం



ఉత్సాహంగా సాగుతున్న ర్యాలీ



సుల్తాన్‌బజార్ /అఫ్జల్‌గంజ్: రామలక్ష్మణ్ జానకి.. జై భోలో హనుమాన్‌కి అంటూ నినాదాలతో గౌలిగూడ రామ్‌మందిర్ నుంచి తాడ్‌బన్ ఆంజనేయ ఆలయం వరకు నగర వీధులు మారుమ్రోగాయి. కాషాయం జెండా చేతబూని మనుమంతుని నామస్మరణం చేస్తూ యుకులు హనుమాన్ భక్తులు రెట్టింపు ఉత్సాహంతో వీర హనుమాన్ విజయ యాత్ర (బైక్‌ర్యాలీ)లో పాల్గొన్నారు. హనుమాన్ జన్మోత్సవం సందర్భంగా బజరంగ్‌దళ్ విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం గౌలిగూడలోని రామ మందిరంలో ప్రత్యేక యజ్ఞం కార్యక్రమంతో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి హర్యానా రాష్ట్ర గవర్నర్ దత్తాత్రేయ హాజరై హనుమంతుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ.. హిందూవులలో హిందూ జాగరణ శక్తి పెరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ హాజరై శ్రీరాముని మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దేశాన్ని, ధర్మాన్ని రక్షించేందుకు విశ్వహిందూ పరిషత్ కృషి: నీరజ్ దునేరియాజీ..

- గౌలిగూడ రామమందిర్ నుంచి ప్రారంభమైన వీర హనుమాన్ విజయయాత్ర కోఠి ఆంధ్రా బ్యాంక్ చౌరస్తాకు వేలాది మంది భక్తులు చేరుకోవడంతో అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, కార్యదర్శి పండరినాథ్ నేతృత్వంలో జరిగిన బహిరంగ సభలో భక్తులు సామూహిక హనుమాన్ చాలీసాను పఠించారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన నీరజ్ దునేరియాజీ మాట్లాడుతూ.. దేశంలో అనేక రకాల సమస్యలు ఉన్నాయని ఆ సమస్యలన్నిటి పరిష్కారానికి హిందుత్వం ఒక్కటే మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో యాదిరెడ్డి, మోహన్‌రావు, రామరాజు, వీరేశం, మహేష్, కైలాష్, భరత్‌వంశీ, చికోటి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

భారీ బందోబస్తు..

విజయయాత్రలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ 10 వేల మంది పోలీసులతో భారీ బందోబస్తును నిర్వహించారు. యాత్ర జరుగుతున్న సమయంలో వర్షం కురవడంతో భక్తులు రెట్టింపు ఉత్సాహంతో యాత్రను కొనసాగించారు. ఈ కార్యక్రమంలో చికోటి ప్రవీణ్‌కుమార్, గోవింద్‌రాఠి, జిగ్నేష్ దోషి తదితర ప్రముఖులు హాజరయ్యారు.

గౌలిపురాలో..

గౌలిపురా: విశ్వ హిందూ పరిషత్తు, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో గురువారం వీర హనుమాన్ విజయయాత్ర బైక్ ర్యాలీని పెద్ద ఎత్తున నిర్వహించారు. గౌలిపురా మిత్రా క్లబ్ ప్లే గ్రౌండ్ నుంచి ప్రారంభమైన వీర హనుమాన్ విజయయాత్ర బైక్ ర్యాలీ ఛత్రినాక చౌరస్తా, లాల్‌దర్వాజా, లాల్‌దర్వాజా మోడ్, శాలిబండ చౌరస్తా మీదుగా గౌలిగూడ రామ్ మందిర్ ద్వారా సికింద్రాబాద్ తాడ్‌బన్‌లోని హనుమాన్ ఆలయం వరకు కొనసాగింది. ఈ బైక్ ర్యాలీకి పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన స్వాగత వేదికపై నుంచి ర్యాలీకు స్వాగతం పలికి పలికారు.

పాతాళ హనుమాన్ ఆలయం నుంచి..

దూద్‌బౌలి: కామాటిపురా పాతాళ హనుమాన్ ఆలయం నుంచి బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో గురువారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ బైక్ ర్యాలీ కామాటిపురా నుంచి ప్రారంభమై దూద్‌బౌలి చౌరస్తా, సిప్లిగంజ్, కాల్ భైరవ్ హనుమాన్ ఆలయం, బారా గల్లీ, గొల్లకిడికి, పార్దివాడ, పురానాపూల్ మీదుగా గౌలిగూడకు చేరుకుంది. బీజేపీ నాయకులు ఉమామహేంద్ర, చార్మినార్ నియోజకవర్గం కన్వీనర్ సురేందర్, బీజేపీ సీనియర్ నాయకులు వెంకటాచలం ముదిరాజ్, సుమిత్ గౌడ్, నిరంజన్ కుమార్ పాల్గొన్నారు. ర్యాలీ సందర్భంగా దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య నేతృత్వంలో అదనపు డీసీపీ ఆనంద్, చార్మినార్ ఏసీపీ రుద్రభాస్కర్, చార్మినార్ ఇన్‌స్పెక్టర్ గురు నాయుడు, హుస్సేనీఆలం ఇన్‌స్పెక్టర్ నరేశ్ కుమార్, కామాటిపురా, బహదూర్‌పురా ఇన్‌స్పెక్టర్ల ఆధ్వర్యంలో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

డబీర్‌పురాలో..

డబీర్‌పురా: కోమటివాడిలోని వీరాంజనేయ స్వామి ఆలయంలో గురువారం హనుమాన్ జన్మోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయం నుంచి వీర హనుమాన్ విజయయాత్రను నిర్వహించారు. ఈ శోభాయాత్రలో గుర్రాలపై పలువురి వేషధారణలో విశేషంగా ఆకట్టుకున్నారు.



కోఠి ఆంధ్రాబ్యాంక్ చౌరస్తా వద్ద బహిరంగ సభలో మాట్లాడుతున్న నీరజ్ దునేరియాజీ



హనుమాన్ వ్యాయామశాల వద్ద ర్యాలీగా బయల్దేరుతున్న బజరంగ్ సేనా నాయకులు



గౌలిపురా మిత్రా క్లబ్ ప్లే గ్రౌండ్ నుంచి..



ర్యాలీలో ఆలే భాస్కర్ రాజ్, రాకేశ్ తివారీ



జోరు వానలో కొనసాగుతున్న వీర హనుమాన్ విజయయాత్ర



కామాటిపురాలో.. ఉమామహేంద్ర, బజరంగ్‌దళ్, నాయకులు



కోమటివాడిలో..



శోభాయాత్రలో బీఆర్ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్ యాదవ్

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని వాడవాడలా ఘనంగా నిర్వహించారు. బీజేపీ నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించి పార్టీ సాధించిన విజయాలను వివరించారు. కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

– అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల బృందం



పటేల్‌నగర్‌లో .. మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర



జియాగూడలో.. మాజీ కార్పొరేటర్ మునేందర్, అధ్యక్షుడు లక్ష్మీనారాయణ



గుఫానగర్‌లో.. కార్పొరేటర్ శశికళ కృష్ణ తదితరులు



గుడిమల్కాపూర్‌లో పతాకావిష్కరణ చేస్తున్న దేవర శ్రీనివాస్ తదితరులు



కట్టెలమండి కార్యాలయం వద్ద గోపాల్‌జీ తదితరులు

క్యాబ్ డ్రైవర్‌పై కత్తితో దాడి

- కారుతో ఉడాయించిన దుండగులు
- జీపీఎస్‌తో వాహనం గుర్తింపు
- ఇంజన్ ఆఫ్ కావడంతో పారిపోయిన ఆగంతకులు



డ్రైవర్ మీర్జా ఆజం బేగ్

పహాడీషరీఫ్: విమానాశ్రయానికి వెళ్లాలంటూ క్యాబ్ బుక్ చేసుకున్న ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు డ్రైవర్‌పై కత్తితో దాడికి పాల్పడి కారుతో ఉండాయించిన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం తెల్లవారుజామున జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. చాంద్రాయణగుట్టకు చెందిన మీర్జా ఆజంబేగ్(21) ఊబర్ కారు నడుపుతుంటాడు. గురువారం అర్ధరాత్రి 12.45 గంటలకు ఊబర్ యాప్‌లో వచ్చిన మెసేజ్‌కు అనుగుణంగా విమానాశ్రయం వెళ్లేందుకు ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులను కారులో ఎక్కించుకున్నాడు. ఓటీపీ నంబర్ అడడగా, ఫోన్‌లో ప్రాబ్లమ్ ఉందని.. కాసేపట్లో చెబుతామని పేర్కొన్నారు. పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ దాటగానే మూత్ర విసర్జన కోసం కారు ఆపాలన్నారు. కాసేపట్లోనే విమానాశ్రయం వస్తుందని.. అక్కడే ఆపుతానని డ్రైవర్ బదులిచ్చాడు. దీంతో ఆగ్రహించిన వెనక సీటులో కూర్చున్న వ్యక్తి గట్టిగా పట్టుకోగా.. పక్క సీటులో ఉన్న వ్యక్తి.. డ్రైవర్ తలపై కత్తితో దాడి చేశాడు. గాయాలకు గురైన డ్రైవర్ కిందికి దిగగానే.. ఇద్దరు నిందితులు కారుతో ఉడాయించారు. అనంతరం బాధితుడు విషయాన్ని మరో డ్రైవర్ సాయంతో ఎయిర్‌పోర్ట్ పార్కింగ్‌కు చేరుకున్నాడు. తనపై జరిగిన దాడి విషయాన్ని క్యాబ్ డ్రైవర్స్ వాట్సాప్ గ్రూప్‌లో పోస్ట్ చేయడంతో యజమాని అజ్మత్‌కు తెలిసింది. వెంటనే జీపీఎస్ సిస్టం ద్వారా పరిశీలించగా కారు బేగంబజార్‌లో ఉన్నట్లు గుర్తించారు. టెక్నాలజీ సాయంతో ఇంజన్ ఆఫ్ చేయించడంతో నిందితులు కారును వదిలి పరారయ్యారు. చికిత్స అనంతరం బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

రాష్ట్రంలో లీకేజీల ప్రభుత్వం

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



కండువా కప్పి స్వాగతం పలుకుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

గోల్కొండ: తెలంగాణలో లీకేజీల ప్రభుత్వం కొనసాగుతుందని వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ప్రజలు డస్ట్‌బిన్‌లో వేయడం ఖాయమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన గుడిమల్కాపూర్‌లో జరిగిన బీజేపీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఈనెల 8న రాష్ట్రానికి రానున్న ప్రధాని మోదీ బహిరంగ సభపై చర్చించారు. ఈ సమావేశంలో వివిధ పార్టీలకు చెందిన 100 మంది యువకులు ఆయన సమక్షంలో బీజేపీలో చేరారు. ఆయన వారిని పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేస్తూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే వారిని అరెస్ట్ చేస్తుందని ఆరోపించారు. మద్యం స్కాం, టీఎస్‌పీఎస్సీ, 10వ తరగతి పేపర్ల లీకేజీలు ప్రభుత్వ పెద్దలకు తెలుసని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతమ్‌రావు, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు దేవర శ్రీనివాస్, పవన్‌కుమార్ తదితరులున్నారు.

సింధూర శోభితం

అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో గురువారం హనుమాన్ జన్మోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికార, అనధికార ప్రముఖులు, నాయకులు పాల్గొని ఆలయాల్లో హనుమంతునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

– అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల బృందం



కోల్సివాడి హనుమాన్ జయంతి వేడుకల్లో నిర్మల్‌కుమార్‌యాదవ్



మంగళ్‌ముఖి హనుమాన్ ఆలయంలో.. ఆలే జితేంద్రను సన్మానిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు



వేడుకల్లో బీఆర్ఎస్ నాయకుడు సురేష్ ముదిరాజ్



సాయిబాబానగర్‌లో పూజలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



గుడిమల్కాపూర్‌లో.. బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ జీవన్‌సింగ్



వేడుకల్లో లాల్‌దర్వాజా సింహవాహిణి ఆలయం కమిటీ మాజీ చైర్మన్ తిరుపతి నర్సింగ్‌రావు



పూజలు చేస్తున్న రాష్ట్ర ఓబీసీ సెల్ ఇన్‌చార్జ్ దిద్ది పెంటయ్య



పూజలు చేస్తున్న మమతా గుప్తా, సంతోష్‌గుప్తా



వేడుకల్లో మెట్టు వెంకటేష్ తదితరులు